ప్రియమైన రాధీ!

నీవు వ్రాసిన రెండు వుత్తరాలు చేరాయి వెంటనే జవాబు ఇవ్వలేని నా అసమర్థతను మన్నిస్తావు కదూ!

రాధీ! ఈ లోకంలో స్త్రీగా పుట్టడమే మహా పాపమేమో! అందుకే పెద్దలన్నారు 'ఆడదై పుట్టడం కంటే అడవిలో మానై పుట్టడం మేలని" నిజం రాధీ! ఈ మాట ముమ్మాటికీ నిజం. అసలు విషయం చెప్పక ఏమిటిది సోది రాస్తుందను కుంటున్నావు కదూ! అసలు విషయం చెపుతాను విను. కాదు.. కాదు.. రాస్తున్నాను చదువు.

రాధీ! అందంలో మన్మథుని మించిన వాడిని కట్టుకుని సుందర మధుర స్వప్న లోకంలో విహరించే నీకు ఈ చెలి ఎప్పుడైనా గుర్తు వస్తుందా?" అని వ్రాశావు. హు . రాధీ! హృదయ సౌందర్యం లేని బాహ్య సౌందర్యం ఏమిలాభం చెప్పు? నా విషయంలో ఇదే ఋజువైంది. ఎంతో అందగాడని పైసా కట్నం కూడా ఆశించకుండా ఆదర్శవంతంగా నన్ను ఈయన వివాహం చేసుకున్నారని నాతో పాటు మీ అందరు కూడా మురిశారు అవునా రాధీ! వీళ్ళు కట్నం వద్దనడం కేవలం నాటకం మాత్రమే. నేనెలాగూ అమ్మా, నాన్నలకు ఒక్క కూతురునే కదా! నాన్న తరువాత పొలమూ మూడు మేడలూ నాకే వస్తాయని వీరి ఐడియా. అందుకే కట్నం వద్దన్నారు. ఒకరోజు మధ్యాహ్నం నేను కళ్ళు మూసుకుని పడుకుని వున్నాను. నేను నిదురపోయాననుకొని మా అత్తా, మామ, ఆయన ఈ విషయాలు మాట్లాడుకున్నారు అది విన్నాక వీళ్ళపై నాకు చెప్పలేనంత అసహ్యం వేసింది. కేవలం అదొక్కటే కాదు నా అసహ్యానికి కారణం. మరొటి వుంది చెప్తాను. పెళ్ళికి ముందు నాన్నగారు మా సంసారానికి కావలసినవన్నీ ఇస్తామన్నారు కదా! అన్నమాట ప్రకారం నాన్నగారు పంటింటికి కావలసిన స్టీలు సామాన్లు, గ్యాసెస్టౌవ్, గ్రైండర్, వాటర్ ఫిల్టర్, డైనింగ్ టేబుల్, చైర్స్, గాద్రెజ్ బీరువా ఇవన్నీ ఇచ్చారు కదా! అవి వీరికి తృప్తి కలిగించలేదు. సంసారానికి అవి ఇస్తే చాలా ఒక టి. వి. ఫ్రిజ్, వాషింగ్ మెషన్, ఎయిర్ కూలర్ కూడా ఇస్తారనుకున్నాము. ఇవి లేకుండానే సరిపుచ్చాలని చూస్తున్నారు మీ వాళ్ళు. కానీ కట్నం కూడా ఆశించలేదు మేము. అలాంటపుడు ఇంటికి ఎంతో అవసరమైన ఆ నాలుగు వస్తువులు కూడా ఇవ్వకపోతే ఎలాగనుకున్నావ్? ఈ మారు పుట్టింటికి వెళితే మీ నాన్నగారిని అడిగి అవి కొనిపించుకునిరా' అంటూ శాసించింది మా అత్తగారు. ఇకపోతే ఆయనగారు "కట్నమే వద్దన్న నాకు మీ నాన్న కనీసం స్కూటరైనా కొనిస్తాడనుకున్నాను. నీవైనా చెప్పవద్దా? ఆ మాట? ఈ మారు వెళ్ళినపుడు మీ నాన్నగారి నడిగి స్కూటర్ కొనిపించు కొనిరా." అన్నారు.

"మీ అమ్మగారు ఫ్రిజ్, టి వి. ఎయిర్ కూలర్, వాషింగ్ మెషన్ అది తెమ్మన్నారు. మీరేమో ఏకంగా స్కూటరే అడుగుతున్నారు. ఇవన్నీ కలిసి యాభైవేల దాకా అవుతాయే అలాంటపుడు కట్నం వద్దనడం ఎందుకు? కట్నం తీసుకోకుండా ఆదర్శవంతంగా వివాహం చేసుకున్నానని పది మందిలో గొప్పలు చెప్పుకోవడానికా?" అన్నాను నేను కోపంగా.

దాంతో ఆయనకు చాలా కోపం వచ్చింది.

"నన్నే ఎత్తి చూపే దానివయ్యావా?" అంటూ చెయ్యి చేసుకున్నారు ఆ రోజు నుండి నేనలా అన్నానని నాపై కోపం చూపుతూ, అడపా, దడపా చేయి చేసుకుంటున్నారు. అంతవరకు ఆయన నాపై చూపిన ప్రేమంతా నటన అని తెలిసిపోయింది నాకు అమ్మా, నాన్నలకు నేనొక్కదాన్నే అని కట్నం అడగలేదు వీళ్ళు. కట్నం వద్దంటే తాము అడిగినవన్నీ కొనిస్తారన్న దురాశ చేత. అమ్మా, నాన్నల తదనంతరం ఆస్తి అంతా వస్తుందన్న పేరాశ చేత కట్నం వద్దన్నారు. ఇప్పుడు చెప్పు రాధీ! ఇదేనా ఆదర్శం?


'ఈ మారు వెళ్ళినపుడు మేమడినవి తీసుకు రాకపోతే నీవే ఇంటి గడప కూడా త్రొక్కడానికి వీల్లేదన్నారు' అత్త, మామ, ఆయన.

"రాధీ' కానీ కట్నమే వద్దన్న వారు ఇవన్నీ అడిగారని తెలిస్తే నాన్న వూరుకుంటారా చెప్పు? నాన్న సంగతి నీకు తెలుసుగా? మంచికి మంచి, చెడుకు చెడు నాన్న కిష్టమైతే అడగకున్నా కొనిస్తారు అది ఎంత ఖరీదుదైనా సరే కానీ... రాధీ! వాళ్ళిలా అడిగారని తెలిస్తే నాన్న మండి పడరూ? చెప్పు రాధీ! ఇప్పుడు నేనేం చేయాలి? పైగా వీళ్ళు తక్కువైన వాళ్ళేమి కాదు. పైకి మంచితనం ముసుగు వేసుకున్న నరరూప రాక్షసులు. నేను ఇంట్లో చేసే ప్రతి పనికి ఏదో ఒక వంక పెట్టి నన్ను తిట్టడంతో పాటు చెయ్యి కూడా వేసుకుంటుంది మా అత్త. ఈ దుఃఖాన్నంతా నాలో నేనే దాచుకుని కుమిలి పోతున్నాను. అమ్మా, నాన్నలకు ఈ విషయాలు తెలిస్తే ఎంత బాధ పడతారు? అందుకే వాళ్ళకీ విషయాలేమి వ్రాయలేదు. నీవు కూడా ఎప్పుడైనా మా ఇంటికి వెళ్ళితే కూడా చెప్పకు ప్రాణ స్నేహితురాలివైన నీకు చెప్పుకున్నాక (వ్రాశాక) నా బాధ ఒకింత తగ్గినట్లుంది.

రాధీ! అమ్మ, నాన్నల సమక్షంలో అల్లారు ముద్దుగా పెరిగ్గిన నేను, క్రిందికి దింపితే చాలు కందిపోతా నన్నట్లుగా పెరిగిన నేను వీరి ఆరళ్ళు భరించలేకున్నాను. తల్లిదండ్రులు ·ఇంత సుకుమారంగా పెంచడం గూడా తప్పేమో అనిపిస్తుంది. అటు అమ్మా, నాన్నలకు నా బాధ చెప్పుకోలేక ఇటు వీళ్ళ బాధలు భరించలేక కుమిలి పోతున్నాను. వీరి కోర్కెలు తీర్చే తాహతు నాన్నగారి కున్నా, వీళ్ళు అడిగారని తెలిస్తే పూచిక పుల్ల కూడా కొనివ్వరు. అలాంటపుడు నాన్న నడిగే ధైర్యం కూడా లేదు నాకు. అలాగని వీరి బాధలూ భరించే శక్తి లేదు అందుకే నాలాటి దానికి ఆత్మహత్యే శరణ్యమని నిర్ణయించుకున్నా. నాలుగైదు రోజుల్లో నేనక్కడికి వస్తున్నా. నీవీ వుత్తరానికి బదులేమి ఇవ్వకు. అమ్మా, నాన్నలను ప్రాణ మిత్రురాలివైన నిన్నూ కడసారి చూచుకున్నాక యీ తనువు చాలిస్తాను. ఈ విషయం ఎవరికైనా చెప్పావంటే నా మీద ఒట్టు. మరి వుంటాను.

ప్రేమతో,
నీ నెచ్చెలి,
అనిత.

ఆ వుత్తరాన్ని ఒకటికి పది మార్లు చదువుకుని గాఢంగా నిట్టూర్చింది రాధిక. స్నేహితురాలి



# అమ్మాయిలూ! పిరికితనం మానండి!

బాధలు తెలుసుకున్నాక ఆమె మనసంతా దుఃఖంతో నిండిపోయింది

హు. . . . కట్నం తీసుకోమంటూ ఆదర్శం అనే ముసుగు మాటున వాళ్ళు చేస్తున్న దురంతం ఇదా? అతని అందం చదువు చూసి. కట్నం వద్దన్నా అతని ఆదర్శ భావాలకు పొంగిపోయారు తామంతా. అతన్ని. అతని తలితండ్రుల సంస్కారాన్ని వేనోళ్ళ పొగిడారు ఆ నాటి వారి ఆదర్శం మాటున వున్న వారి అంతర్యం ఇటువంటిదని కలనైనా వూహించలేదే? ఛీ ... ఛీ... ఇటువంటి




కిశోరి

కుసంస్కారులు కూడా వున్నారనుకుంటే ఈ లోకంలో ఎవరిని నమ్మాలి ఇక?"

"అనిత!" దాన్ని తలచుకుంటేనే గుండెల్లో చెయ్యి పెట్టి కెలికినట్లుగా వుంది. తల్లిదండ్రుల మాటున అల్లారు ముద్దుగా పెరిగిన ముద్ద మనోహర మూర్తి అనిత. ఆమె సౌందర్యానికి తోడు చక్కని సంస్కారం, వినయ విధేయతలు మరింత మెరుగులు దిద్దాయి అటువంటి అనిత వైవాహిక జీవితం ఎంతో వైభవంగా వుంటుందని వూహించిన తన వూహలన్నీ కల్లలేనా? చివరికి ఆ అమాయకురాలు, ఆ కుసంస్కారుల దుర్మార్గానికి బలి కావలసిందేనా?

నో....నో... అలా జరుగడానికి వీల్లేదు. నా అనిత, నా ప్రాణ స్నేహితురాలి బ్రతుకు అంతం కావడానికి వీల్లేదు. దాన్ని ఎలాగైనా ఈ ఆత్మహత్యా ప్రయత్నం నుండి విరమించుకొనే లాగున చెయ్యాలి. అనుకుని మనసులో నే గట్టిగా నిర్ణయించుకొంది రాధిక.

* * * *

ఇంటి ముందు కారాగిన శబ్దం కాగానే వరండాలో పేము కుర్చీలో కూర్చుని చదువుకుంటున్న రాధిక ఒక్క వుదుటున గేటు వద్దకు వెళ్ళింది. అప్పటికే కారు దిగిన అనిత.....

'సాయంత్రం ఆరు గంటలకు రా మూర్తి!" అనడంతో అతను కారు వెనక్కు త్రిప్పుకుని వెళ్ళిపోయాడు కారు వెళ్ళగానే వెనుదిరిగిన అనిత గేటు వద్దనే నిలుచుని తనను శల్య పరీక్ష చేస్తున్న రాధికను చూడగానే, ఆమె కళ్ళల్లో నూతన కాంతి వచ్చి చేరుకుంది.

'ఎలావున్నావు రాధీ?" అంటూ నవ్వుతూ స్నేహితురాలి భుజంపై చేయి వేసి నొక్కింది ప్రేమగా

ఆ చేతిని అలాగే ఆప్యాయంగా పట్టుకుని తన నడుం చుట్టు వేసుకుని అనిత భుజంపై చేయివేసి లోనికి నడిపించుకుని వెళ్ళింది ప్రేమగా, మౌనంగా.

'ఏమ్మా అనితా! బాగున్నావా? ఏమిటిది? చాలా చిక్కిపోయావు? ఏమైనా విశేషమా?" నవ్వుతూ ప్రశ్నించింది రాధిక తల్లి సరోజమ్మ.

"చాలా రోజులకు చూసి నందువల్ల మీకలా అనిపిస్తున్నానంతే. అందులో విశేషమేమి లేదు. మీరెలా వున్నారు?" నవ్వుతూనే ప్రశ్నించింది అనిత.

"మాదేముందమ్మా? మామూలే. క్రొత్త పెళ్ళికూతురివి. నీవే చెప్పాలి విశేషాలు."

అబ్బ.....బ్బ ....ఏమిటమ్మా? అది ఇప్పుడేగా వచ్చింది. కాస్త దాన్ని వూపిరి అయినా పీల్చుకోనిస్తావా? లేదా?" నవ్వుతూ తల్లితో అన్నా అందులో కాస్త అసహనం గూడా ధ్వనించడం సరోజమ్మ గమనించలేదు గాని, అనిత గమనించింది.

"రేలేవే తల్లీ! నీతో మాట్లాడ నివ్వనని కోపంగాబోలు నీకు. మేడమీది కెళ్ళి లక్షణంగా భోజనాల వేళవరకూ కబుర్లు చెప్పుకోండి. నే

## సుఖాల గనులు

డబ్బు దస్కం
భూమి పుట్ర
చదువు సంధ్య
వున్నా లేకున్నా
ఇంద్ర భోగాలు
చవి చూపించేవి
రెండే రెండు
'రాజకీయం'
'చిత్రసీమ'

—మాధవరపు కృష్ణ

## అమ్మాయిలూ! పిరికితనం మానండి!

నచ్చురాను. కాఫీ ఇస్తాను త్రాగి వెళ్ళండి ' అంటూనే కాఫీ కలిపి రెండు గ్లాసులలో పోసి చెరో గ్లాసు అందించింది

స్నేహితురాళ్ళిద్దరూ మౌనంగానే కాఫీ త్రాగి మెడమీద కెళ్ళి బాల్కనీలో సోఫా మీద కూర్చున్నారు ఇద్దరూ మౌనంగా ఆలోచిస్తూ కూర్చున్నారు చివరికి

"రాధీ! ఏమిటే అంత మౌనం దాల్చావు?" అడిగింది అనిత.

"మౌనం దాల్చక ఏం మాట్లాడమంటావు అనీ! నిన్ను చూస్తుంటే నా కెంత బాధగా వుందో తెలుసునా? ఎటువంటి నీవు ఎలా అయిపోయావు?" అంటూ కళ్ళల్లో నీళ్ళు తిరగ్గా బాధగా అంది రాధిక.

"ఎందుకే అలా బాధ పడతావు? ఏం చేద్దాం? భగవంతుడు కొందరి నుదుటను అలా బాధలు పడమని లిఖిస్తాడు. దానికి మనం బాధ్యులం కాముగా?" అంది నవ్వడానికి ప్రయత్నిస్తూ అనిత.

"అనీ! ఎంత సెంటిమెంట్‌గా ఆలోచిస్తున్నావు? బి. ఎ. వరకు చదివిన నీవు ఇలా మాట్లాడటంలో అర్థంలేదు. చదువు రాని వాళ్ళు మాట్లాడ వలసిన మాటలవి మనుషులు చేజేతులా చేసుకునే దానికి భగవంతు డెలా బాధ్యుడౌతాడు? మనకు పనిచేయడానికి కాళ్ళు, చేతులు, ఆలోచించడానికి మెదడు ఇచ్చాడు భగవంతుడు. అంత కన్నా ఏమివ్వాలి మనం? ఇచ్చిన వాటిని సద్వినియోగం చేసుకో లేక పోతున్నాం మనం". అంది కాస్త కోపంగా రాధిక. ఆ మాటలకు పేలవంగా నవ్వింది అనిత.

"నా విషయ మంతా వివరంగా వ్రాశాను కదా నీకు. అందులో నా చేజేతులా చేసుకొనిందేముంది చెప్పు?"

"చేసుకున్నావని కాదు నేను చెప్పేది చేతగాని నిర్ణయాలు తీసుకున్నావని" అంటూ సూటిగా అనిత ముఖంలోకి చూసింది

"నీకు అది చేతగాని నిర్ణయంగానే అనిపించవచ్చు. అంతకు మించి గత్యంతరం లేదు నాకు. అయినా అనుభవంలోకి వస్తే గాని అర్థంకాదెవరికి?" అంది అనిత తలవంచుకుని.

"పిచ్చి అనీ!" అంటూ నవ్వి తర్జనితో అనిత తల పైకెత్తి–

"కొన్ని కొన్ని విషయాలలో అనుభవమే అక్కరలేదు. కొందరి జీవితా[illegible]ాలు నేర్పుతాయి మనకు మా మేనత్త కూతురు కరుణ తెలుసుగా నీకు. పెళ్ళిలో కట్నం తీసుకుని కూడా అడపా, దడపా డబ్బు తెమ్మని అమ్మగారింటికి తరిమే వాడు దానిభర్త. మా అత్తా వాళ్ళు మాత్రం ఎక్కడి నుండి తేగలరు? ఇచ్చినంత కాలం ఇచ్చారు చివరికి ఓ రోజు

'మేమిక ఇవ్వలేం తల్లీ! ఇచ్చే వాడ్ని చూస్తే చచ్చేవాడైనా లేచి వస్తాడు. అతను అడిగినట్లల్లా ఇస్తూ పోతుంటే దానికి అంతు లేకుండా పోతుంది. ఇప్పటికే మీ నాన్న గారికి బోలెడు అప్పుంది. అది తీర్చే దారి లేక సతమత మౌతున్నారాయన పెళ్ళై ఆరు నెలలైంది కదా! నీ భర్తకు నీవే నచ్చ చెప్పుకోవాలి మాటి మాటికి మేం డబ్బెక్కడి నుండి తేగలం చెప్పు?" అని సున్నితంగా మందలించి పంపింది అత్త. వట్టి చేతులతో తిరిగి వచ్చిందని గొడ్డును బాదినట్లు బాదేవాడు ప్రతి రోజతను. ఆ హింసలు పడలేక చివరికో రోజు వురి పోసుకుని చచ్చి పోయింది." అంటున్న రాధికతో

"ఏమిటి? కరుణ చచ్చిపోయిందా?" ఆశ్చర్యంగా, బాధగా అడిగింది అనిత.

తను, రాధి, బి. ఎ. ఫైనల్ ఇయర్ చదువుతుండగా ఒకసారి వచ్చి నపుడు చూసింది కరుణను. ఎంతో చలాకీగా, హుషారుగా తమతో తిరిగిన కరుణ రూపం గుర్తురాగానే మనసు కలచి వేసినట్లయింది అనితకు.

"అవును అనీ! చచ్చిపోయింది. కానీ, చచ్చి ఎవరిని సాధించిందో చెప్పు?" అడిగింది రాధిక, అనితను.

"ఎవరినో సాధించడానికి ఛస్తారా? ఆ బాధలు పడలేక చచ్చిపోయుంటుంది గాని"

"బాధలకు చావే పరిష్కారమా?" తీక్షణంగా, ప్రశ్నించింది రాధి.

"చావక ఏం చేయమంటావో చెప్పు?" అయోమయంగా చూసింది అనిత.

"హు..... అవును కదూ! నీవూ దానిలాగే పిరికిగా ఆలోచిస్తున్నావు కనుక దాన్ని సమర్థిస్తున్నావు"

"అది పిరికితన మంటావా?"

"కాక..... ధైర్యమంటావా?" ఎదురు ప్రశ్న వేసింది రాధిక.

"అయితే నేనో మాట అడుగుతాను చెబుతావా రాధీ!"

'అడగవే... .. ."

"రాధీ! నీకే కరుణలాంటి పరిస్థితి గాని, నా లాంటి

పరిస్థితి గాని ఎదురైతే ఏం చేస్తావు చెప్పు?"

"నీలాగా పిరికి దానిలాగా చావుగురించి మాత్రం ఆలోచించను. ఎందుకంటే మధ్యన వచ్చిన అతని కోసం కని, పెంచి పెద్ద చేసిన కన్న వారిని పుట్టెడు దుఃఖంలో ముంచి ఛస్తాననుకున్నావా? నెవ్వర్.... అలా ఎన్నటికీ చేయను. పెళ్ళి అనేది నూరేళ్ళ పంట. భార్యా, భర్తలిరువురూ పరస్పర ప్రేమానురాగాలతో పాలు, నీళ్ళలా కలిసిపోతేనే అది నిజమైన దాంపత్యం అనిపించుకుంటుంది. అంతే గాని తాళి కట్టినంత మాత్రాన భార్య పై సర్వ హక్కులున్నాయను కొని ఏమి చేసినా అణిగి మణిగి వుంటుందని ఇష్టాను సారం హింసించి పశువులా ప్రవర్తించే వాడికోసం నా ప్రాణాలను ఎందుకు త్యాగం చేస్తాను?" ఆవేశంగా అంది రాధిక.

"అయితే...... అయితే...... అలాంటి పరిస్థితులలో ఏం చేయాలంటావు ఏ స్త్రీ అయినా?"

"తన కాళ్ళ మీద తాను నిలబడాలి. వుదాహరణకు కరుణ విషయమే తీసుకుందాం. తను చచ్చి పోయింది. చచ్చి ఎవరిని సాధించగలిగింది చెప్పు? భార్య పోయి నెల తిరక్క ముందేపెళ్ళి చేసుకోవాలని ఆలోచిస్తున్నాడా మహానుభావుడు. భార్య పోయిందన్న బాధ ఇసుమంతైనా ఏ కోశానా లేదతనిలో. కానీ.... కానీ.... కన్నందుకు కడుపుకోత తప్పు లేదుగా? అత్తా వాళ్ళకు... భార్య పోయిందని అతను మరో భార్యను తెచ్చుకోగలడు. కానీ... కన్న కూతురుని పోగొట్టుకున్న వాళ్ళు మరో కూతురిని తెచ్చుకోగలరా? చెప్పు. బ్రతికినంత కాలం ఆ దుఃఖం వారిని వదులుతుందంటావా?"

"రాధీ!..." రాధిక మాటలు విన్న అనిత అయోమయంతో పిచ్చిదానిలా అరిచింది.

ఆమె కళ్ళ ముందు తను ఆత్మహత్య చేసుకున్నట్టు, తన శవం ముందు అమ్మా, నాన్న కూర్చుని గుండె లవిసేలా ఏడుస్తున్నట్టు దృశ్యం కదలగానే తల్లడిల్లి పోయిందామె మనసు.

"ఏం అనీ! నేను మాట్లాడిందాంట్లో తప్పేమైనా వుందా?" అనునయంగా అడిగింది రాధిక.

"వూ. – హు..." తప్పులేనట్టు తల అడ్డంగా తిప్పింది.

"అనీ!..." ఆమె మనసులోని సంచలనాన్ని గ్రహించి ప్రేమగా పిలుస్తూ, అనితను ఒడిలోకి తీసుకుంది రాధిక.

"చూడు అనీ! కరుణ పోయినా అత్తా వాళ్ళకు ఇంకా ఇద్దరు కొడుకు లున్నారు. నీవుపోతే మీ అమ్మావాళ్ళ కెవరున్నారు చెప్పు? వాళ్ళను కడుపు కోతకు గురి చేస్తావా? ఒక్కగా నొక్క కూతురివి నీవుపోతే వాళ్ళు మాత్రం బ్రతుకుతారంటావా? చెప్పు.. ."

"వద్దు రాధీ! ప్లీజ్... ఇక చెప్పకు." ఏడుస్తూ గొంతు జీరబోగా రాధిక ఒడిలో అసహనంగా తల కదిలించింది.

ఆమె తలను ప్రేమగా, ఆప్యాయంగా నిమురుతూ ఇలా అంది–

"పిచ్చి అనీ! వూహ మాత్రంగానే ఇంతగా కదిలిపోతున్నావే. నిజంగా జరిగితే ఎలా వుంటుంది? ఆత్మహత్య పిరికి వాళ్ళ లక్షణం. నీకేం తక్కువైందని ఆత్మహత్య చేసుకుంటావు? చదువు, సంస్కారం, అందం, ధనం, సున్నిత హృదయం అన్నీ వున్న అపురూపమైన దానివి నీవు. ఇలా ఆలోచించడం తగదు నీకు. వెంటనే అన్ని విషయాలు అమ్మా నాన్నకు చెప్పెయ్యి. నీకు వుద్యోగం చేయవలసిన అవసరం లేదుగానీ "ఐడిల్ మైండ్ ఈజ్ డెవిల్స్ వర్క్ షాప్" అన్న ఇంగ్లీషు సామెతను గుర్తుంచుకుని ఏదైనా వుద్యోగానికి అప్లై చెయ్యి. ఆ పనిలో పడిన నీకు అనవసరమైన ఆలోచనలు రావు ఇంతకు మించిన మార్గం మరొకటి లేదు" అంది

రాధిక అలా ధైర్యం చెప్పగానే ఏడుపు మాని కాసేపు ఆలోచించింది. రాధిక చెప్పినదే సబబుగా తోచిందామెకు.

"రాధీ! నీవు చెప్పినట్టుగానే జాబ్ చేస్తాను." దృఢ నిశ్చయంతో కళ్ళు తుడుచుకుంటూ లేచి కూర్చుంటూ అంది.

"అనీ ఒకవేళ మీ నాన్నగారు వారడిగినవన్నీ కొనివ్వడానికి ఒప్పుకుంటే ఏం చేస్తావు?"

"లేదు రాధీ! నాన్న అలా ఎప్పటికీ చేయరు. మనిషిని మనిషిగా ప్రేమించే వారిని ప్రేమిస్తారు గాని డబ్బును ప్రేమించే మనిషిని నాన్న అసహ్యించు కుంటారు. నాన్న ఎప్పుడూ ఏమంటారో తెలుసా? ప్రేమను మించిన ధనం లేదీ లోకంలో... అని. కానీ రాధీ! మా అత్తింటి వాళ్ళందరికీ ధనాన్ని మించిన స్వర్గం, సంతోషం మరొకటి లేదనుకుంటారు. అలాంటి వారికి నాన్న డబ్బు ఇవ్వరు. ఒకవేళ ఇచ్చినా వారి కంతటితో ఆ ధన దాహం తీరదు మళ్ళీ దేనికో ఒకదానికి పేచీ పెట్టకపోరు."

"అయితే అలాటి వారితో పూర్తిగా తెగతెంపులు చేసుకోవడమే వుత్తమం. నీ అందానికి, గుణానికి తగిన వరుడు ఎప్పటికైనా తారస పడక పోడు."

"రాధీ! ఏమిటి నీవనేది? నన్ను... నన్ను... మళ్ళీ పెళ్ళి చేసుకోమంటావా?" అరిచినట్టుగానే అడిగింది

"ఏం అందులో తప్పేముంది అనీ! భార్యను విడిచినవాడు, భార్య పోయినవాడు తిరిగి పెళ్ళిళ్ళు చేసుకోవడంలా? మగవాడు చేసుకుంటున్నప్పుడు ఆడదానికేమి? మగవాడికో రూలూ? ఆడదానికో రూలూనా?" ఆవేశంగా అంటున్న రాధికను బిత్తరపోయి చూసింది అనిత.

"అమ్మో! రాధి కేవలం అమాయకురాలు అనుకున్నానుగాని, దీనిలో ఇన్ని అభ్యుదయ భావాలున్నా యనుకో లేదు" అని మనసులోనే ఆశ్చర్యపోయింది అనిత

"ఏం అనీ! ఇలా మాట్లాడుతున్నానని ఆశ్చర్యంగా వుందా?" నవ్వుతూ అడిగింది రాధిక.

"ఇలా మాట్లాడేది నా రాధియేనా?" అని ఆశ్చర్యంగావుంది అంది అనిత మనసు తేలికపడగా నవ్వుతూ.

తిరిగి ఇలా అంది–

"అయినా రాధీ! ఇప్పటికి జరిగింది చాల్లే. తిరిగి పెళ్ళి చేసుకొని ఆ వూబిలో ఇరుక్కో లేను. నా లైఫ్ ఇలా గడిచిపోతే చాలు" అంది నిట్టూరుస్తూ.

"వూబి అని ఎందుకు అనుకుంటావు అనీ! పురుషులందరూ ఒకే లాగున వుండరు. ఈ లోకంలో మంచి, చెడూ సమ్మిళితమై వుంటాయి. నీకు తగిన వరుడు భవిష్యత్తులో తప్పక తారసిల్లుతాడు అని నా నమ్మకం."

"అబ్బ, నీ నమ్మకానికో నమస్కారం ఇక ఆ టాపిక్ మానెయ్యి. ముందు ఈ వూబి నుండి నన్ను బైటపడి మళ్ళీ స్వేచ్ఛావాయువులు పీల్చుకోనివ్వు. ఆ తర్వాత ఆలోచించవచ్చు."

"నిజమే నీవు చెప్పింది సరేగాని అనీ! ఇంటికి వెళ్ళాక తిరిగి మనసు మార్చుకోవు గదూ?" అనుమానంగా అడిగింది రాధిక

"లేదు. ఇక అలా జరగదు" అంది అనిత స్థిరంగా.

"ప్రామిస్ !" అంటూ చెయ్యి చాపింది.

"గాడ్ ప్రామిస్.." అంటూ రాధిక చేతిలో చెయ్యివేసి ప్రమాణం చేసింది

ఆ క్షణాన ఇద్దరి మనసులూ తేలిక పడ్డాయి. ఆత్మహత్యా ప్రయత్నం నుండి స్నేహితురాలిని రక్షించుకున్నందుకు రాధిక మనసంతా సంతోషంతో నిండిపోయింది ఆత్మహత్యా ప్రయత్నం నుండి తనను రక్షించినందుకు రాధిక యెడల కృతజ్ఞతతో నిండివుంది అనిత మనసు.

ఇంతలో సరోజమ్మ క్రింద మేడమెట్ల వద్ద నిలబడి భోజనానికి కేకేయడంతో ఇద్దరూ క్రిందకు వెళ్ళారు తేలికపడ్డ మనసులతో □

